వ్యాఖ్యానించకుండా ఈ వ్యాఖ్యానంపై అంగీకారం వుండాలి. 'దురాక్రమణ' అంటే ఏమిటో స్పష్టమైన నిర్వచనం చేయాలి.

అమెరికా అణుశక్తిని తగ్గించటానికి రష్యా సైనికబలాన్ని తగ్గించటానికి అంగీకారానికి రావాలి. ఉభయులూ తమ మిలిటరీ శక్తిని, మిలిటరీ బడ్జెటును బహిరంగపరచాలి.

విభిన్న దృక్పథాలు, వారివారి సాంస్కృతిక సంప్రదాయాల ననుసరించి స్వేచ్ఛగా వుండటానికి వీలున్నదని అంగీకరించాలి.

యూరప్‌లో రష్యన్ టూరిస్టులకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు రష్యాలో యూరపియన్ టూరిస్టుల కుండాలి.

ఐక్యరాజ్య సమితిచే నిర్ణయించబడిన మానవ హక్కులకు సంబంధించిన సూత్రాలను అన్ని రాజ్యాలు అమలులోకి తేవాలి.

ఇలాంటి విషయాలపై అంగీకారం కుదిరితేనే ప్రపంచంలో శాంతి యేర్పడుతుంది. అంతేకాని శాంతి మహాజర్ల వల్ల, అమెరికా బ్రిటన్‌లను దూషించే రచనలవల్ల శాంతి ఏర్పడదు. విజ్ఞులు తమ బాధ్యతలను గుర్తించి ఆ బాధ్యతను సక్రమ పద్ధతిలో నిర్వర్తించాలి. అప్పుడే వారు ప్రపంచ శాంతికి తోడ్పడ గలుగుతారు.

———:O:———

స్కెచ్

# సంగీతాభిమానులు

## ఇచ్ఛాపురపు జగన్నాథరావు

మా వూళ్ళో ఒక క్లబ్బు ఉంది. కాని ప్రమాదం ఏమిటంటే, న్యూస్‌పేపర్లు కాని, లైబ్రరీ పుస్తకాలు కాని అక్కడ చాలా తక్కువ. భగవంతుడిచ్చిన దాని ప్రత్యేకత ఒక్క రేడియో సెట్టు.

ఆ రేడియో వెయ్యడం చూస్తూంటే, మార్కోనీకి పాఠాలు చెప్తూంటారా అనిపిస్తూంటుంది. కొంతకాలం క్రిందట క్లబ్బులోని ప్రతి మెంబరుగారూ రేడియోని కాస్త ట్యూన్ చేస్తూనే ఉండేవారు. కాని, ఆ పద్ధతితో రెండు బ్యాండ్లు కాలిపోయాక అలాంటి పనిలోని నష్టాన్ని గ్రహించి, నిర్వాహక సంఘ సభ్యులు రేడియో యొక్క పెద్ద తనమంతటినీ బంట్రోతు చేతిలో పెట్టారు. మొదట యెవరైనా మెంబరుచేతికి ఇద్దామనుకున్నారు. కాని ఆ సమయంలోనే భారత రాజ్యాంగ శాసనం (1950) అమలులోకి రావడమూ, తద్వారా సదరు రేడియో మీద పతి మెంబరుగారికీ సమాన హక్కు ఉండడమూ మూలాన కాబోలు, ఇలాంటిపని చేయాల్సి వచ్చింది.

సామాన్యంగా ఆ రేడియోద్వారా మహా భయంకర శబ్దాలు మాత్రం వినిపిస్తూంటాయి. పాపం, రేడియో కూడా యథాశక్తి సహాయం చేసే కార్యక్రమంలో, బేటరీ లేక నెలకి నాలుగు రోజులు పలుకక, సెలవు పెడుతూనే ఉంది.

మిగతా రోజుల్లో, సంగీత కార్యక్రమం సదరు బంట్రోతు చేతిలో ఉంటుంది. అలాటి ఒకరోజన చిన్న సంఘటన జరిగింది.

* * *

క్లబ్బులో చేసే పని ఎలాగా లేదు కాబట్టి రేడియోకి కాస్త దగ్గరగా కూర్చుని సంగీతం ఏదో వస్తూంటే వింటున్నాను. ఎవరో శ్రావ్యంగా ఫిడేల్ వాయిస్తున్నారు. చాలా బాగుంది. కాని అది వినడానికెవరూ రాలేదు. అందరూ ఏదో బాతాఖానీలో పడిఉన్నారు.

ఇంతట్లో అక్కడికి శేఖరం వచ్చాడు.

"ఏమిట్రా చాలా జాగ్రత్తగా వింటున్నావు?" అన్నాడు,

"ఏమిటీ లేదు, ద్వారం నాయుడుగారు ఫిడేల్ వాయిస్తున్నారు. వింటున్నాను. నీకూడా కావలిస్తే విను" అన్నాను.

మావాడు సంగీతం అంటే పడిచావడు, చెవి కోసుకోడు కాని ద్వారం నాయుడుగారి ఫిడేల్ అంటే వాడికి ప్రాణం. అందుకని, తొందరగా వెళ్ళి మెంబర్లందరితోనూ ద్వారం నాయుడుగారి ఫిడేల్ ప్రోగ్రామ్ అవుతూంది;

ర్మ్మనమని లాక్కొచ్చాడు.

వాడెందుకు వెళ్ళాడో తెలియక ఊరుకున్నాను. కాని రెండు నిమిషాలలో పదిమంది సభ్యులూ, శేఖరమూ వచ్చారు. కుర్చీలలో కూర్చున్నారు.

సంగీతం వినేవాడూ, తిట్లు తినేవాడూ ఒంటరిగా అనుభవించలేడట. నేను సరదాకి ద్వారంవారి ప్రోగ్రామ్ అని చెప్తే, శేఖరం వెళ్ళి ఈ పెద్దవారినందరినీ లాక్కొచ్చాడు.

"చూశారూ, ద్వారంవారి పాటకి సరస్వతి లయవేస్తుందిట" అన్నారు "క" గారు, కండువా జాగ్రత్తగా ఒళ్లో దాచుకొంటూ.

"అందుకు సందేహమా? వినండి; ఆ మనోహరత్వం గ్రహించారా? దేవతా సహాయం లేకుండా ఆ తీపి ఎలా వస్తుంది? అక్షరాలా అంతే" అన్నారు "చ" గారు.

"ప"గారు అందుకుని "ఆ ముక్తాయింపులు చూశారా? అవి నాయుడు గారితో పుట్టినవి. వారికీతప్ప ఇంకొకరికి సాధ్యాలు కానివవి" అన్నారు. ఆయన కెవ్వరూ ఫిడీలుకీ ముక్తాయింపులకీ గల బాంధవ్యం చెప్పలేదు.

"ట"గారు ఇంతదాకా అర్థనిమీలిత నేత్రులై సంగీత సుధా మాధుర్యాన్ని ఆస్వాదిస్తూన్న వారల్లా ఒక్కసారి భక్తి తెచ్చుకుని "వారి పాటకి నాగులు నాట్యం చేస్తాయట. మహానుభావులు. ఓహో ఒళ్లు పులకరిస్తూంది చూశారా. రాగం వింటోంటే," అన్నారు. అనేసి మళ్ళా పూర్వ స్థితిలో పడ్డారు.

"స"గారు తక్కువవారేమీ కాదు. ఆయన అందుకుని, "హంసభ్రమరి రాగం వారి ఫిడేలుమీదే వినాలండీ. ఆహాహా! ఏమి సంగీత ధార! ఆ సంగతులు చూడండి ఎలాగవేస్తారో" అన్నారు ఓ సంగతి వినిపించడానికి మధ్యన ఆగి.

వచ్చిన ప్రమాదం, ఆ ప్రక్కనఉన్న "త" గారు సంగీతంలో కాస్త సరుకు ఉన్న ధీమంతులు. ఆయనకీ, "స"గారికీ పడదు. అందుకని ఈ అదును చూసుకుని, "అది హంసభ్రమరేమిటీ, నా మొహం? (!) కరహరప్రియ రాగం. వినలేదూ?" అని అడ్డు ప్రశ్న వేశారు.

అసలు "స"గారు వాదనకి మా ఊరుకి రెండున్నర ఫర్లాంగుల చుట్టులో ఎదురులేని వారు. ఆయన అన్నారు, "గొప్ప ప్రశ్నేనండీ. "హంసభ్రమరి" వారి ఫిడేల్ మీదే వినాలండీ అన్నాగాని, ఇది హంసభ్రమరి అని అన్నానా కరహరప్రియ నాకు తెలీదా?" అని.

ఇదంతా వింటూన్న "మ"గారు "ద్వారం వారి కళలు ప్రత్యేకాలు సుమండీ. అదిగో చూడండి. (రేడియోలో సంగీతంతో పాటు పెద్ద శబ్దం) వెధవ రేడియో ఇలాంటివి విననివ్వదు సరిగా. వచ్చే మీటింగులో మంచి రేడియోకి ప్రపోజలు పెట్టించాలి. చూడండి. వినండా కళలు... నేను మదరాసులో పని చేస్తున్నప్పుడు ఆయన వాద్యం సరిగా విన్నానా, అప్పటినించి గుర్తివి" అనేసి ఊరుకున్నారు. ఆయన ఒకానొక కాలంలో మదరాసులో ఉద్యోగం చెయ్యడంవల్ల ఆ విషయం అందరూ మరిచిపోకూడదని ఆయన దృఢవిశ్వాసం.

ఇంతట్లో "క"గారు అందుకుని అన్నారు: "మైలుదూరంలో ఆయన వాద్యం వినిపిస్తే పరిగెడతాను సుమండీ. అందుకే హార్మోనియం వదిలేసి అమ్మాయికి ఫిడేల్ నేర్పిస్తున్నాను."

ఆయన కూతురికి ఫిడేల్ నేర్పిస్తున్నాడని మా అందరికీ తెలిసింది. నాకు ఒళ్లు మండుతోంది. కాని ఏమంటాను! అప్పటి దాకా ఆయన వాయిస్తోన్నది సరస్వతి రాగం అయినా నేను కేవలం చిన్నవాణ్ణి కనుక ఊరుకున్నాను. ఇంతట్లో సరస్వతి రాగాలాపన పూర్తయింది.

"మలయమారుత రాగమ్" అని ప్రకటన.

"బహుచక్కని రాగమండీ" అన్నారు "చ"

"నిద్ర, నిద్రవస్తోందండీ. మా మనవరాలి పెళ్ళిలో మైసూరు విద్వాంసుడు ఆలాపిస్తే మగత కమ్మినట్లయింది."

ఆయనకి మనమరాలు చాలా ముఖ్యమైనది. అదీ కాక ఆయన మైసూరునించి తెప్పించారు. ఆ సంగతి తెలిసికున్నాను.

"మలయ మారుతం పాడడానికి సరియైన కాలం. అందుకే ఇంకా హాయిగా ఉంది" అన్నారు "ప". అందరూ సమ్మతించారు. (కాలం సాయంత్రం నాలుగున్నర)

ఒక్క నిమిషం నిశ్శబ్దంగా గడిచింది.

"రాజమండ్రీలో నాయుడుగారు, "శీరంగ మెల్లిపోతానే" వాయించారు. అద్భుతం అంటే!" అన్నారు "స" గారు.

"త" గారు, తమ తక్కువతనాన్ని అంగీకరించక, "మా నాన్నగారి స్నేహితులొకరు నాయుడు గారికి ప్రియ శిష్యులు. ఆయన చెప్తూండేవారు నాయుడుగారి గొప్పతనం. ఈ మలయమారుతానికి వారిదందవేసిన చెయ్యిలెండి" అన్నారు.

రేడియో తన పని తాను చేసుకుపోతోంది సగం సంగీతాన్ని, సగం ఇతర శబ్దాలనీ వెలికి పంపుతూ. పోదామా అనుకున్నాను ఆ గోలలో ఆ సగం సంగీతాన్ని వినలేక. కాని, గౌరవంగా ఉండదని కూర్చున్నాను. అదీకాక నాయుడుగారి సంగీతాన్ని ఎలాగ వదలడం?

శాస్త్రీయ, అశాస్త్రీయ సంగీతాల మీద తర్జనభర్జనలు సాగిపోతున్నాయ్. సంగీతం ఆగిపోయింది.

"ఆలిండియో రేడియో ..మద్రాసు నిలయమ్. ఇంతవరకూ కుంభకోణం సంభవయ్యర్ గారి గానం విన్నారు. తరువాతి కార్యక్రమం కొద్దిక్షణాల్లో ప్రారంభింపబడుతుంది."

"వ" గారికి శేఖరంమీద చాలా కోపం వచ్చింది. "ద్వారం నాయుడుగారిదని కబుర్లు చెప్పావే?" అన్నారు కొంచెం కోపంగానే.

"చ" గారికికూడా శేఖరంమీద కోపం వచ్చింది. కుర్రవాళ్ళకి తొందర యెక్కువ. ద్వారంవారి ప్రొగ్రామ్ అంటె నిజం అనుకున్నాను. చక్కటి కథ చదువుతూ వదిలేశాను" అన్నారు.

"ట" గారు, ఆట్టే కోపం చూపలేదు కాని, ఆయనకి శేఖరం అంటే అభిమానం తగ్గిపోయింది.

"ప" గారూ, "మ" గారూ శేఖరాన్ని పీకలైనంత దెబ్బలాడి మళ్ళా పూర్వస్థానాలకి వెళ్ళిపోయారు.

శేఖరానికి సుమారుగా ఏడుపు వచ్చింది. నామీద వాడికి చాలాకోపం వచ్చిందికూడా. నాతో మాట్లాడ్డం మానేశాడు.

కాని, నేనేం చేసేది?

---

# బలివితర్ది

నా నలివెచ్చని రక్తముతో
కల్పి
చల్లిన అన్నము
బలిముద్దా!
నీ తొలిముద్దా?
నా రక్త తైలముతో
తడిపి
నరాలు పేడిన వత్తి
నా వరాల—నరాలు పేడిన వత్తి
వెలిగిస్తే
నీ ఆరాధనా?
నా శిథిల హృదయవేదనా?
యుగయుగ క్లిన్నజీవిత గృహాశోధనా
జీర్ణించిన నా ఈ అస్థులు
చేసిన
అలంకరణమా నీకు
ఆభరణమా?
నా మరణమా?
నా గుండె నీ బండకాలికి
నా పేదగుండె
వేసిన
బలిపీఠమా?
నీ లాస్యశాలయా?
నా శోకశాలయా?
నా కాలిన భస్మము నీ
దాల్చు
విభూతియా?
నా భీతియా?
నా జీవితమంతా పేడిన పలుపు
నీ నిట్టూర్పులో ఇమిడిన పిలుపు
నా జీర్ణించిన కోర్కులు
తన గర్భంలో క్లుప్త మొనరించుకొన్న
ఈ కాలస్మశానము
నీ నిత్య క్రీడాలోల
భూత ప్రేత పిశాచగణ పరివృత
బృందావనమా?
ఈశాన!

—యస్. రాజేశ్వరి రాణి